# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- అహ్మదాబాద్ లో విమాన ప్రమాద ఘటనా స్థలాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పరిశీలించారు.
- దేశ ఆరోగ్య సంరక్షణలో AIIMS సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు.
- ఐరోపా దేశాలతో భారతదేశం బలమైన సంబంధాలను కలిగి ఉందని విదేశాంగ మంత్రి జై శంకర్ తెలిపారు.
- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ రేపు ఢిల్లీలో హైబ్రిడ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోంది.

======================

అహ్మదాబాద్ లో విమాన ప్రమాద ఘటనా స్థలాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకుని ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన విమాన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్‌ను ప్రధానమంత్రి పరామర్శించారు. అనంతరం ఈ ప్రమాదంపై నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ.. విమాన ప్రమాదంతో దేశం తీవ్ర దిగ్భ్రాంతికి గురైందని, ఇంత ఆకస్మికంగా, హృదయ విదారకంగా చాలా మంది ప్రాణాలు కోల్పోవడం మాటల్లో చెప్పలేనిదని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. ప్రభుత్వం వారి బాధను అర్థం చేసుకుంటుందని విచారం వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం ఉంటుందని, ఆ వేదనను మాటల్లో చెప్పలేమని అన్నారు. ప్రమాద ఘటనపై అహ్మదాబాద్ లో ఉన్నతాధికారులతో ప్రధానమంత్రి సమీక్ష నిర్వహించారు.

అనంతరం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ కుటుంబ సభ్యులను నరేంద్రమోదీ పరామర్శించారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు. నిన్న అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో సిబ్బందితో సహా 241 మంది ప్రాణాలు కోల్పోయారు.

=======================

ఐరోపా దేశాలతో భారతదేశం బలమైన భాగస్వామ్య సంబంధాలను కలిగి ఉందని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. ఐరోపా దేశాల పర్యటనలో ఉన్న కేంద్రమంత్రి ఈరోజు ఫ్రాన్స్ లోని మాసెలాలో జరిగిన Raisina Mediterranean సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... యూరప్ దేశాలతో అనుసంధానంలో సముద్ర మార్గాలు కీలకంగా మారాయన్నారు. తూర్పు భారతదేశాన్ని వియత్నాం వరకు అనుసంధానించడానికి ప్రయత్నిస్తున్నామని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

ప్రపంచ వ్యాప్తంగా యోగాను ఆరోగ్య సాధనంగా ప్రోత్సహించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో ఆకాశవాణితో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ... 2014లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పడినప్పటి నుండి భారతదేశం యోగా సంస్థాగతీకరణలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. పని సంబంధిత ఒత్తిడిని ఎదుర్కోవడానికి నిపుణులు సూచించిన ఐదు నిమిషాల గైడెడ్ యోగా మాడ్యూల్ ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు.

=======================

ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల దాడుల నేపథ్యంలో గగనతల పరిస్థితుల దృష్ట్యా ఎయిర్ ఇండియా 16 అంతర్జాతీయ విమానాలను దారి మళ్లించామని వెల్లడించింది. ప్రయాణీకులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపింది. వారిని వారి గమ్యస్థానాలకు చేర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు సామాజిక మాధ్యమంలో పేర్కొంది. ఈ విమానాలలో ప్రయాణించే ప్రయాణీకులకు రద్దు, ఉచిత రీషెడ్యూలింగ్‌పై తిరిగి చెల్లింపులను కూడా అందిస్తోంది. ప్రయాణీకులు తమ విమానాల తాజా స్థితిని ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లో చూడాలని  సూచించింది.

విరామం

=======================

దేశ ఆరోగ్య సంరక్షణలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIIMS) సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని  కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. ఈరోజు నాగ్‌పూర్‌లోని AIIMSలో "ఉత్తమ పద్ధతులు" అనే అంశంపై జరిగిన మొదటి కాన్‌క్లేవ్‌లో కేంద్రమంత్రి దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొని ప్రసంగించారు. జాతీయ ప్రాముఖ్యత సంస్థలైన ఎయిమ్స్‌లో అధునాతన క్లినికల్ కేర్, అధిక-నాణ్యత గల  వైద్య విద్య, పరిశోధనా నైపుణ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడానికి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలకు అభ్యాస కేంద్రంగా పని చేస్తున్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ రేపు ఢిల్లీలో హైబ్రిడ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తుంది. ఒక భూమి, ఒకే ఆరోగ్యం నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ యోగా సంస్థలు, ఆరోగ్య కేంద్రాల నుండి వెయ్యి మందికి పైగా

పాల్గొననున్నారు. అలాగే దేశ, విదేశాల నుండి యోగా గురువులు, విధాన నిర్ణేతలు, ఆరోగ్య నిపుణులు, వ్యాపార నాయకులు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

======================

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై విమాన ప్రమాద దర్యాప్తు మండలి (ఏఏఐబీ) ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించిందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రమాద ఘటనపై ఆయన ఈరోజు అహ్మదాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ... అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ నిర్దేశించిన ప్రామాణిక నిబంధనల అనుగుణంగా ఏఏఐబీ దర్యాప్తు చేపట్టిందని తెలిపారు. దీనికి అదనంగా వివిధ విభాగాల్లో నిపుణులైన వ్యక్తులతో కూడిన అత్యున్నత స్థాయి క్రమశిక్షణ సంఘాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కేంద్రమంత్రి తెలిపారు. విమానయాన భద్రతను మరింత బలోపేతం చేసేలా, భవిష్యత్‌లో ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ సంఘం సూచిస్తుందని రామ్మోహన్ నాయుడు వివరించారు.

======================

ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపధ్యంలో దౌత్యపరమైన మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని భారతదేశం ఇరు దేశాలకు సూచించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన భారత్ అణు కర్మాగారాలే లక్ష్యంగా జరిగిన దాడులతో సహా అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఈ ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా చూసుకోవాలని ఇరు దేశాలను కోరింది. రెండు దేశాలతో తమకు సన్నిహితమైన సంబంధాలు ఉన్నాయని, సమస్యను పరిష్కరించుకునేందుకు తాము మద్దతిస్తామని ఈ సందర్భంగా పేర్కొంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయా దేశాల్లోని భారతీయులతో అక్కడి భారత రాయబార కార్యాలయాలు సంప్రదింపులు జరుపుతున్నాయని వెల్లడించింది. అక్కడి భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు చెప్పే భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించింది.

======================

లండన్ లోని లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ ఈ రోజు మూడో రోజుకు చేరుకుంది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల లక్ష్య ఛేధనలో  ఇప్పటి వరకూ దక్షిణాఫ్రికా 2 వికెట్ నష్టానికి 102 పరుగులు చేసింది. 2025 టెస్ట్ ఛాంపియన్ షిప్ టైటిల్ ను కైవసం చేసుకునేందుకు దక్షిణాఫ్రియా ఇంకా 180 పరుగులు చేయాల్సి ఉంది.

======================

భారత్ నుంచి త్వరలో చైనాకు విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ శాఖ ఉప మంత్రి సన్ వీడాంగ్‌తో విక్రమ్ మిస్రీ ఈ రోజు సమావేశమయ్యారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పునర్ నిర్మించడానికి చర్చలు జరిపామని వెల్లడించారు. ఇరువురి మధ్య నిర్మాణాత్మకంగా, సానుకూల వాతావరణంలో జరిగిన ఈ చర్చల్లో వాస్తవాధీన రేఖ దగ్గర నెలకొన్న పరిస్థితిని సమగ్రంగా సమీక్షించామన్నారు.

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81 వేల 692 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరకు 573 పాయింట్ల నష్టంతో 81 వేల 118 వద్ద ముగిసింది. నిఫ్టీ చివరకు 169 పాయింట్ల నష్టంతో 24 వేల 718 వద్ద  స్థిరపడింది.